క్లుప్తంగా

చేతకాని తనంతోనే యూరియా కొరత



కురమాన బాలక్రిష్ణారావు

నందిగాం: ముఖ్యమంత్రి చంద్రబాబు, వ్యవసాయ శాఖా మంత్రి అచ్చెన్నాయుడు చేతకాని తనంతోనే యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కురమాన బాలక్రిష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన నందిగాంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వం యూరియాకు ఇస్తున్న సబ్సిడీ కోసం రైతులను బలి చేస్తున్నారని దుయ్యబట్టారు. రాష్ట్రానికి రావల్సిన మొత్తం యూరియాలో 30 శాతం తక్కువ తీసుకొని దాని ద్వారా వచ్చే రాయితీని దారి మళ్లించే ప్రయత్నం చేశారని ఆరోపించారు.

'మాపొట్టకొట్టే చర్యలను అడ్డుకోండి'



ఎమ్మెల్సీ రామారావుకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కవిటి: ఉద్దానం ప్రాజెక్టులో సుమారు మూడు దశాబ్దాలు ఎంతో విలువైన సేవలందించిన తమను అడ్డగోలు జీవోతో తొలగించి రోడ్డున పడేయడం భావ్యం కాదని తొలగింపునకు గురైన వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావును మంగళవారం కలిసి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. మేఘసంస్థ తీసుకున్న ఏకపక్ష నిర్ణయంతో తమకు ఉద్యోగాలు తొలగించడం సరికాదని అన్నారు.

నాయీబ్రాహ్మణులు ఐక్యత చాటుకోవాలి



జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టెక్కలి: నాయీబ్రాహ్మణులంతా ఐక్యత చాటుకోవాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.నాగరాజు కోరారు. మంగళవారం కోటబొమ్మాళి నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో వరల్డ్ నాయీబ్రాహ్మణ దినోత్సవాన్ని నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మత్తుకు దూరంగా ఉండాలి

టెక్కలి రూరల్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. లింగలవలస గ్రామంలో సంకల్పం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

టెక్కలి: మహిళల ఆరోగ్యంపై అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని టెక్కలి ఐసీడీఎస్ పీవో విద్యా శతపతి అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. స్థూలకాయ నివారణ, బాల్య దశలో పోషణ, సంరక్షణ, శిశు, చిన్న పిల్లల ఆహార అలవాట్లలో మార్పులపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ సంధ్య, సరస్వతి, శారద, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

డెప్పూరుకు మౌలిక దుపాయాలు

సాక్షి ఎఫెక్ట్..

ఇచ్ఛాపురం రూరల్: డెప్పూరు దళిత గ్రామం మౌలిక సదుపాయాలకు నోచుకోలేదు. దీంతో అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీనిపై 'పాలకులకు పట్టని డెప్పూరు' శీర్షికన ఈ నెల 15వ తేదీన 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. డిప్యూటీ ఎంపీడీవో ఎల్.వెంకటరావు మంగళవారం గ్రామానికి వెళ్లి స్థానికులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి బోరుకు మరమ్మతు చేయించడంతో పాటు బావిలో క్లోరినేషన్ చేపట్టారు. గ్రామానికి సరైన రోడ్డు లేకపోవడంతో ఉపాధి హామీ పథకం నిధులు రూ.49లతో అప్రోచ్ రోడ్డు మంజూరైందని, త్వరలో పనులు చేపట్టడం జరుగుతుందని ఎంపీడీవో కె.రామారావు తెలిపారు.

విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: విద్యుత్ శాఖా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జేఏసీ రాష్ట్ర నాయకులు ఎం.వి. గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పలాస విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద మంగళవారం విద్యుత్ శాఖా కార్మికులు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి అందోళన చేపట్టారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, పెండింగ్‌లోని డీఏలను తక్షణమే చెల్లించాలని కోరారు. జేఏసీ నాయకులు, విద్యుత్ శాఖాధికారులు నాగభూషణం, బి.కోదండరావు, ప్రభాకర్, తిరుపతిరావు, లింగరాజు, శేఖర్, విద్యుత్ శాఖా కార్మికులు పాల్గొన్నారు.

డాక్టర్ లేని వైద్య సేవలు!

- ఆరు నెలలుగా డాక్టర్ లేక రోగుల ఇబ్బందులు
- అరకొరగా ఫ్యామిలీ డాక్టర్ సేవలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



డాక్టర్ లేకుండానే బెంకిలిలో వైద్యసేవలు అందజేస్తున్న 104 వాహన, సచివాలయ వైద్య సిబ్బంది

104 వాహనం

సోంపేట: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు గ్రామ స్థాయిలోనే అందించేందుకు గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అత్యాధునిక వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. 104 వాహనాల ద్వారా సేవలు అందించడంతో పాటు కదలలేని రోగుల ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి మెరుగైన వైద్య సేవలు అందించారు. అయితే ప్రస్తుతం చాలా మండలాల్లో తగినంత మంది డాక్టర్లు లేక సరైన వైద్యం అందడం లేదని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోంపేట మండలంలో సుమారు ఎనిమిది నెలలుగా డాక్టర్ సేవలు కరువయ్యాయి. కేవలం 104 వాహన సిబ్బంది, ఏఎన్‌ఎంలే రోగులకు దిక్కు అయ్యారు.

ఒక్క డాక్టరే దిక్కు..

గతంలో కొర్లాం, బట్టిగళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నలుగురు వైద్యులు విధులు నిర్వహించే వారు. ప్రస్తుతం ఎనిమిది నెలలుగా రెండు ఆరోగ్య కేంద్రాలకు ఒక్కరే డాక్టర్ విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఫ్యామిలీ డాక్టర్ సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతుంది. రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్యామిలీ డాక్టర్ సేవలు గ్రామాల్లో అందనప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. డాక్టర్ వస్తే అతని వద్ద తమ సమస్యలు చెప్పుకొని మెరుగైన వైద్యం పొందేవాళ్లమని..ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని రోగులు చెబుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో 104 వాసభం ద్వారా నెలలో రెండుసార్లు గ్రామాలకు వెళ్లి 14 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి రోగికి అవసరమైన మందులు అందజేసేవారు. ప్రస్తుతం ఐదు రకాల వైద్య పరీక్షలు కూడా జరగడం లేదని, మందులు కూడా తూతూ మంత్రంగా అందుతున్నాయంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదని గ్రామీణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మత్స్యకార గ్రామాలే ఎక్కువ..

సోంపేట మండలంలో తీరప్రాంత గ్రామాలతో పాటుమత్స్యకార గ్రామాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ నివసిస్తున్న ప్రజలు అనారోగ్యం బారినపడితే పట్టణాలకు వెళ్లి చికిత్స చేయించుకోవాలంటే నిర్లక్ష్యం చేస్తుంటారు. దీంతో వ్యాధి ముదిరి ఇబ్బందిపడేవారు. ఇలాంటి వారికి గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం చాలా ఉపయోగంగా ఉండేది. గ్రామానికే వైద్యుడు వస్తుండడంతో అనారోగ్యానికి గురయ్యేవారంతా స్థానికంగానే వైద్య పరీక్షలు చేయించుకొని చికిత్స పొందేవారు. అయితే ప్రస్తుతం 104 వాహనం వస్తున్నా డాక్టర్ లేక పోవడంతో రోగులకు మెరుగైన సేవలు అందడం లేదు. ప్రభుత్వం, అధికారులు స్పందించి వైద్యులను నియమించి ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

వైద్యులను నియమించాలి



గ్రామాలకు 104 వాహనం ద్వారా సరైన వైద్యం అందడం లేదు. గతంలో వాహనంలో గ్రామానికి వైద్యుడు వచ్చి రోగులకు పరీక్షలు చేసి మందులు అందించంతో మెరుగైన సేవలు అందేవి. ఫ్యామిలీ డాక్టర్ సేవలు మత్స్యకార గ్రామాల ప్రజలకు చాలా అవసరం. ప్రభుత్వం స్పందించి 104 వాహనాల్లో డాక్టర్లను నియమించి ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

– తెప్పల ధర్మారావు, బారువ, సోంపేట మండలం

రోగుల వైద్యంపై నిర్లక్ష్యం



గత ప్రభుత్వ హయాంలో 104 వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన వైద్య సేవలు అందేవి. ఫ్యామిలీ డాక్టర్లు ఇంటివద్దకే రావడంతో రోగులు సంతృప్తి చెందేవారు. ఇంటి వద్దే వైద్యం అందడంతో ఖర్చులు మిగేలివి. ప్రస్తుతం ఫ్యామిలీ డాక్టర్ సేవలు లేక పోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు స్పందించి మండలంలో వైద్యులను నియమించి ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలి.

–డాక్టర్ నిమ్మన దాస్, ఎంపీపీ, సోంపేట

వైద్యుల కొరత

సోంపేట మండలంలోని బట్టిగళ్లూరు, కొర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక్కరే వైద్యుడు ఉన్నారు. దీంతో 104 వాహనంలో గ్రామాల్లోకి వైద్యులు వెళ్లే అవకాశం లేకుండా పోయింది. పీహెచ్‌సీలకు వైద్యులను నియమించి వారు విధుల్లో చేరితే ఫ్యామిలీ డాక్టర్ సేవలు కొనసాగుతాయి.

– బి.సౌజన్య, డాక్టర్, కొర్లాం పీహెచ్‌సీ

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వైద్యాధికారి జుత్తు చిన్ని

వజ్రపుకొత్తూరు రూరల్: ఆస్పత్రి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. అక్కుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని సమస్యలు, రోగుల జాబితా, మందులు, ఇతర అంశాలపై చర్చించారు. అభివృద్ధికి ఆర్థిక ప్రణాళిక రచించారు. ఆస్పత్రికి అవసరమైన సామగ్రిని కొనుగోలు చేసి ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కిడ్నీ బాధిత ప్రాంతంలో ఆస్పత్రి ఉండటం ఈ ప్రాంత ప్రజలకు వరమని, రోగులకు అవసరమైన అన్ని రకాల మందులు, సదుపాయాలు అందుబాటులో ఉండాలని తీర్మానించారు. సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి జుత్తు చిన్ని సూచించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, అక్కుపల్లి, గుణుపల్లి సర్పంచ్‌లు లండ లోలాక్షి, తిర్రి కామేశ్వరి, మాజీ సర్పంచ్ లండ రామలింగం, తిర్రి లక్ష్మీనారాయణ ఉన్నారు.

హరిత పాఠశాలల రిజిస్ట్రేషన్ వేగవంతం



కవిటిలో మాట్లాడుతున్న సమగ్ర విద్యాపథకం జిల్లా కోఆర్డినేటర్ గోవిందరావు, రామకృష్ణ

కవిటి: జిల్లాలోని అన్ని మండలాల్లో స్వచ్ఛ ఏవం హరిత విద్యాలయ పాఠశాలల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సమగ్రశిక్ష సమగ్రవిద్యా పథకం కోఆర్డినేటర్ బి.గోవిందరావు అన్నారు. మంగళవారం కవిటి ఎమ్మార్సీ కార్యాలయాన్ని గోవిందరావుతో పాటు ప్రత్యామ్నాయ పాఠశాలల కోఆర్డినేటర్ కె.రామకృష్ణ, జీసీడీఓ రమాదేవి తనిఖీ చేశారు. జిల్లాలో ఈ ప్రక్రియలో దాదాపు 62 శాతం రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. వంద శాతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. ఈ నెల 19 నుంచి వివిధ కేంద్రాల్లో ఈ ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎంపికలు ఇచ్ఛాపురంలో 19 వ తేదీన జరుగుతాయన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట తదితర కేంద్రాల్లో జరగనున్న దివ్యాంగ విద్యార్థుల ఉపకరణాల ఎంపిక దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ఒక్క యూరియా బస్తా ఇవ్వరా!

సోంపేట: గొల్లూరూ పంచాయతీ పరిధి దామోదరపురం గ్రామానికి చెందిన రైతులకు ఒక్క యూరియా బస్తా కూడా అందజేయారా అని మహిళ రైతులు ప్రశ్నించారు. మంగళవారం గొల్లూరు సచివాలయ పరిధిలో యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అయితే దామోదర పురం గ్రామానికి చెందిన మహిళలు ఉదయం నుంచి కాపాల కాసినప్పటికీ ఒక్క బస్తా కూడా అందజేయలేదు. దీంతో వ్యవసాయ సిబ్బంది కావాలనే కొందరికే యూరియా అందజేస్తున్నారని, తమ గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసుల కార్డన్ సెర్చ్

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో పట్టణ పోలీసులు మంగళవారం ఉదయం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. బెల్లుపడ కాలనీలోని ఇంటింటికీ వెళ్లి అనుమానితులెవరైన వచ్చి ఉంటున్నారా అని తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లకు సంబంధించిన పత్రాలు, కొత్తవారెవరైన ఉంటే వారికి సంబంధించిన ఆధార్ కార్డులను పరిశీలించారు. తనిఖీల్లో పట్టణ ఎస్సై ముకుందరావు, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

మండపల్లిలో కార్డన్ సెర్చ్

ఇచ్ఛాపురం రూరల్: మండపల్లిలో ఇచ్ఛాపురం రూరల్ ఎస్‌ఐ ఇ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యలలో భాగంగా సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజలకు ఇబ్బందులకు గురి చేసే వారిని గుర్తించి ప్రజలకు భరోసా కల్పిస్తున్నట్లు తెలిపారు. తనిఖీలలో ధ్రువీకరణ పత్రాలు లేని 16 ద్విచక్ర వాహనాలతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు.

యూరియా కోసం పడిగాపులు

ఇచ్ఛాపురం రూరల్: బూర్జపాడు రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం మంగళవారం రైతులు పడిగాపులు కాస్తున్నారు. పంచాయతీలో రెండు వందల మందికి పైగా రైతులు ఉండగా ఆలస్యంగా యూరియా రావడంతో రైతులు దాన్ని దక్కించుకోవడానికి ఉదయం నుంచి రాత్రి వరకు ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. రైతుల ఇబ్బందులను గమనించని వ్యవసాయ సిబ్బంది భోజనాలు పేరిట కేంద్రానికి తలుపులు వేసి సాయంత్రం నాలుగు గంటల వరకు రాకపోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజేయ్‌కుమార్, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు సర్ది చెప్పారు.

ముగిసిన డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

పలాస: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో మంగళవారం జరిగిన క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్ అంశాలలో జిల్లా స్థాయికి జరిగిన ఎంపిక పోటీలను మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్ టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు, డివిజన్ స్థాయి కోఆర్డినేటరు పి.తవిటయ్య, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్.రాజ్యలక్ష్మి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ తారక్, టెన్నికాయిట్ సంఘం కార్యదర్శి మల్లా సంతోష్, ఎస్.వి.జోగారావు, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ పద్మలోచన్, కె.పి.రెడ్డి, పి.గజేంద్ర, ఎస్.రామారావు, జి.లోకేష్ పాల్గొన్నారు.

యూరియా కొరతపై సభ్యుల గరం గరం

- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- టెక్కలి మండల సమావేశం



యూరియా కొరతపై అధికారులను నిలదీస్తున్న సభ్యులు

టెక్కలి రూరల్: రైతులకు కావాల్సినంత యూరియాను ఎందుకు సరఫరా చేయడం లేదని అధికారులను సభ్యులు నిలదీశారు. యూరియాను ఇవ్వడం చేతకాక ఇప్పుడు అధిక మోతాదులో వాడవద్దని చెప్పడం ఎంతవరకూ సమంజసమని నిలదీశారు. ఎంపీపీ అట్ల సరోజనమ్మ అధ్యక్షతన టెక్కలి మండల సర్వసభ్య సమావేశం మంగవారం మండలాభివృద్ధి కార్యాలయ సమావేశం మందిరంలో జరిగింది. సభ్యులంతా యూనియా కొరతపై మండిపడ్డారు. కొద్దిరోజులుగా గ్రామాల్లో రైతులు పడుతున్న ఇబ్బందులపై అధికారులను నిలదీశారు. టెక్కలి-3 ఎంపీటీసీ సభ్యుడు సత్తారు ఉషారాణి మాట్లాడుతూ.. యూరియా పూర్తిస్థాయిలో రైతులకు అందివ్వలేని అధికారులు అధిక మొతాదులో వాడరాదని ఇప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఉన్న అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ మంత్రి కావడంతో ఈ ప్రాంతంలో వ్యవసాయం ఎంతో బాగుటుందని అనుకున్నామని.. అయితే ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలోనే రైతులు యూరియా కోసం రోడ్డు ఎక్కాల్సిన పరిస్థితిని తీసుకువచ్చారని అన్నారు. టెక్కలి-4 ఎంపీటీసీ సభ్యుడు వాకాడ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ.. యూరియాను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి రైతులకు అన్యాయం చేశారన్నారు. యూరియాను రైతు సేవా కేంద్రాలు ద్వారా ఎంత మందికి పంపిణీ చేశారో చెప్పాలని వ్యవసాయశాఖాధికారులను నిలదీశారు. యూరియా పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంటే రైతులు ఎండనక, వాననక రోడ్లపైకి వచ్చి ఎందుకు కాపుకాస్తారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం 70 శాతం యూరియాను రైతుభరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసే వారని గుర్తు చేశారు. గతంలో యూరియా ఎంత శాతం వచ్చింది, ఇప్పుడు ఎంత శాతం వచ్చిందో చెప్పాలని అధికారులను నిలదీశారు. పూర్తిస్థాయిలో యూరియా అదుబాటులో ఉంటే ఇలాంటి పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలన్నారు. అలానే టెక్కలిలోని పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న మహాత్మగాంధీ కురగాయల మార్కెట్ భవనాలను అనవసరంగా కూల్చివేసి ఎంతో మందిని రోడ్డున పడేశారని అన్నారు. అలాగే పంచాయతీ కార్యాలయం ఎదురుగా ఉన్న షాపులకు ఇటీవల వేలం వేసేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని.. అయితే ఇప్పటివరకు వాటిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల పరిస్థితి ఏమిటన్నారు. నిబంధనల ప్రకారం అద్దె ఎంతో కొంత పెంచి పాతవారికే షాపులను కేటాయించాలని కోరారు. అలాకాకుండా వేరే వారికి కేటాయిస్తే పేద, సామాన్యవర్గాలకు చెందిన చిరు వ్యాపారులు రోడ్డున పడతారని వ్యాఖ్యానించారు. శానిటేషన్‌కు సంబంధించి వీధుల్లో చెత్త సేకరణ పేరుతో రిక్షాలు, చెత్తబుట్టలకు టెండర్లు వేయకుండానే ఎలా కొనుగోలు చేశారని ప్రశ్నించారు. అనంతరం టెక్కలిని జిల్లా కేంద్రం చేయాలని జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి ఆధ్వర్యంలో ప్రతిపాదన చేసి ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అలానే మాజీ ఎంపీపీ తిర్లాంగి జానకీరామయ్య ఇటీవల మృతి చెందడంతో ఆయన మృతికి సంతాపంగా సభ్యులంతా కొద్దిసేపు మౌనం పాటించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి, ఎంపీడీవో కె.ఫణింద్రకుమార్, వైస్ ఎంపీపీ పి.రమేష్, సభ్యులు కూన పార్వతి, రౌతు జయమోహన్, పీతల హేమలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై చైతన్య ర్యాలీ



ప్రజల జీవితాలను చిత్తుచేసే మాదక ద్రవ్యాలు, గంజాయి, సారా వంటి మత్తు పదార్థాల అక్రమరవాణా, వినియోగంపై సమరశంఖం పూరిద్దామని విద్యార్థులు నినదించారు. రాజపురం పీఎంశ్రీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల నిరోధక కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఎం శివరాంప్రసాద్ పాఢి ఆధ్వర్యంలో మంగళవారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదకద్రవ్యాలు మానవులపై దుష్ప్రభావం అనే అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలు గీసిన ఛార్ట్‌లను ప్లకార్డులుగా ప్రదర్శించారు. సీనియర్ ఉపాధ్యాయుడు నర్తు పాపారావు, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

–కవిటి

కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



మందస మండలం జి.ఆర్.పురం కేజీబీవీ విద్యార్థురులు ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి టార్గెట్ బాల్ పోటీలలో 2, 3 స్థానాల్లో నిలిచి ప్రతిభ కనబర్చారు. అలాగే సోమవారం శ్రీకాకుళంలో జరిగిన జూనియర్ అథ్లటిక్స్ ఎంపిక పోటీల్లో అండర్ 14, 16, 20 విభాగాలలో రాణించి ఎంపిక అయ్యారని కళాశాల పిన్సిపాల్ ఆర్.వాసంతి మంగళవారం తెలిపారు. విద్యార్థినులు ఎస్.ఘూన్సీ, ఎం.చాందిని, కె.దీపిక, సీహెచ్ యమున, ఎ.పూర్ణిమ, ఎస్.సంధ్య, ఎస్.తనస్వి, ఎస్.సింధులకు పీఈటీ జి.సంతోషి శిక్షణ ఇచ్చారు. విద్యార్థినులను కళాశాల లెక్చరర్‌లు, ఉపాధ్యాయులు అభినందించారు.

–మందస

టీచర్లుగా మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థినులు



కంచిలి మండలం మఠం సరియాపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థినులు కొణపల శిరీష, బత్తుల నందినిలు ఉపాధ్యాయినులుగా డీఎస్సీ-2025లో ఎంపికయ్యారు. దీంతో స్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో వీరిని సన్మానించి అభినందించారు. వీరిలో కొణపల శిరీష ఎస్‌జీటీగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, బత్తుల నందిని ఎస్‌జీటీగా ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివప్రసాద్ తెలిపారు. అధ్యాపక, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

–కంచిలి

ఆర్డీవో కోర్టులో కేసు ఉండగా భూ ఆక్రమణ!



కబ్జాకు గురైన స్థలాన్ని చూపిస్తున్న చెన్నూరు బాబ్జీ

సంతబొమ్మాళి: నౌపడ గ్రామంలో విలువైన తన కుటుంబీకుల జిరాయితీ భూమి 40 సెంట్లు వరకు కబ్జాకు గురైందని, దీని విలువ మార్కెట్లో కోటి రూపాయిలు వరకు ఉంటుందని, అధికార పార్టీ నాయకుల అండతో యాథేచ్ఛగా యంత్రంతో భూమిని చదును చేసి, ప్లాట్స్ వేసి అదే గ్రామస్తుడు అక్రమించుకున్నాడని ప్రముఖ సామాజిక కార్యకర్త, భూ యజమాని చెన్నూరు బాబ్జీ ఆరోపించారు. నౌపడలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. నౌపడ పాత పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న స్థలం సర్వే నంబబర్ 383-1లో 1.84 సెంట్లు భూమి ఠాకూర్ మహాదేవ్ సింగ్ కుటుంబీకుల నుంచి 1956లో 1302 రిజిస్ట్రేషన్ నంబర్‌తో తన బంధువు చెన్నూరు పుణ్యవతి కొనుగోలు చేశారని.. అప్పటి నుంచి ఆమె సాగులో ఉందన్నారు. దీనిపై ప్రస్తుతం టెక్కలి ఆర్‌డీవో పరిధిలో కేసు ఉన్నా గ్రామంలో అధికార పార్టీ నాయకుల అండతో యథేచ్ఛగా భూమిని ఆక్రమించి మట్టివేసి ప్లాట్స్‌గా మార్చి వేశారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ఓజోన్ పొరను కాపాడుకుందాం



పలాస: ఓజోన్ పొర ప్రాధాన్యతను వివరిస్తున్న పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జె.వెంకటలక్ష్మి



నందిగాం: లఖిదాసుపురం ఉన్నత పాఠశాలలో 3 ఆకృతిలో కూర్చున్న విద్యార్థులు



పలాస: చినబాడాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రీన్ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ వద్దు..పచ్చదనం ముద్దు' నాటిక ప్రదర్శన

భూమికి రక్షణ కవచం లాంటి ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వక్తలు అన్నారు. ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలు, పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ పొర ప్రాధాన్యతను వివరించారు. సూర్యుని నుంచి వెలువడే అతి నీలలోహిత కిరణాలు నేరుగా భూమిని చేరకుండా స్ట్రాటో ఆవరణం దిగువన ఉన్న ఓజోన్‌పొర అడ్డుకొని అతి నీలలోహిత కిరణాల ప్రభావం నుంచి భూమిపై ఉన్న సమస్త జీవకోటిని రక్షిస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఓజోన్ పొర ఆవశ్యకతపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పిల్లలను 3 ఆకారంలో కూర్చొని అలరించారు.

–సాక్షి నెట్‌వర్క్